



హామీలకే సిద్ధం

అమలు మాత్రం చేయం.. ఇదీ జగన్ తీరు



నర్సాపురంలో రూ.3200 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన జగన్

ప్రాజెక్టుల పేరుతో రియల్ దందా.. పనులు మాత్రం సున్నా

ఎన్నికల ప్రచారానికి నేడు మళ్లీ నర్సాపురం రాక

సీఎం జగన్ ఏడాదిన్నర క్రితం నర్సాపురం వచ్చి మత్స్యకార సభ పెట్టారు. ఆ వేదికపై రూ.3,200 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. నర్సాపురం అభివృద్ధికి కట్టుబడ్డానంటూ ఊదరగొట్టారు. మీ బిడ్డను నమ్మండి. ప్రతిపక్షాలను విశ్వసించకండి అంటూ కట్టు కథలు చెప్పారు. నెలలు గడిచాయి. ప్రాజెక్టులు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. వాటి పేరుతో రియల్ ఎస్టేట్ దందా సాగింది. ప్రాజెక్టుల కోసం ప్రతిపక్షాలు పోరుబాట పట్టినా ప్రభుత్వంలో చలనం లేదు. పైగా ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టారు. అలా జగన్ హామీలు గాలిలో కలిశాయి. ఇప్పుడు మళ్లీ ఎన్నికల సభ కోసం జగన్ నర్సాపురం వస్తున్నారు. ఇప్పుడు ఇంకెన్ని హామీలు ఇస్తారోనంటూ జనం చర్చిస్తున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)


బియ్యపుతిప్ప హార్బర్ కోసం గుర్తించిన స్థలం

బియ్యపు తిప్ప హార్బర్ హుళక్కే

సీఎం హోదాలో జగన్ బియ్యపుతిప్ప హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. టీడీపీ చేయలేని పనిని తాము చేస్తున్నామంటూ గొప్పగా చెప్పారు. ఇప్పటికీ అక్కడ ఒక్క ఇటుక వేయలేదు. కానీ నర్సాపురంలో అధికార పార్టీ నేత అక్కడ బినామీ ఆస్తులను కూడగట్టుకున్నారు. హార్బర్ నిర్మాణం చేపట్టాలంటూ తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు ఇటీవల వారంపాటు అక్కడ ధర్నా నిర్వహించారు. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేదు. హార్బర్ ఊసే ఇప్పుడు లేకుండా పోయింది. ఇలా వైసీపీ ప్రభుత్వం మత్స్యకార ఆశలపై నీళ్ల చల్లింది.

ఆక్వా తరగతులు ఎక్కడ ?

ఆక్వా యూనివర్శిటీని జగన్ ప్రారంభించారు. ఇప్పటికీ తరగతులు నిర్వహించడం లేదు. పరిశోధనల కోసమని తీర ప్రాంతంలో భూమిని గుర్తించారు. ఆ చుట్టు పక్కల చేపల చెరువుల అభివృద్ధికి ప్రణాళిక చేశారు. అవి జిల్లాలోని అధికార పార్టీ ముఖ్య నేతల పేరు మీద డాక్యుమెంట్లు సృష్టించారన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు నర్సాపురంలో ఆక్వా తరగతులు నిర్వహించేందుకు భవనాన్ని గుర్తించారు. కానీ విద్యార్థులకు అడ్మిషన్లు నిర్వహించలేదు. తరగతులు ప్రారంభం కాలేదు. ఐదేళ్లపాటు ఇలా ఆక్వా వర్శిటీని గాలికి వదిలేశారు. ఆ పేరుతో తీరప్రాంతంలో దందా మాత్రం సాగింది.

ఏటిగట్టు.. నాణ్యత తీసికట్టు

నర్సాపురం ఏటిగట్టు ప్రాంతంలో అగ్నికుల క్షత్రియులు నివాసం ఉంటున్నారు. వారికి గోదావరి భయం ఉంటుంది. వరద నివారణకు ఏటిగట్టును నిర్మించారు. నాణ్యత లేకుండా నిర్మించారు. నిర్మించిన కొద్ది నెలలకే కోతకు గురైంది. నాణ్యత లేకుండా నిర్మిస్తున్నారంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. అయినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. చివరకు ప్రతిపక్షం మాటే నిజమైంది. ఏటిగట్టుకు కోతపడింది.

రెగ్యులేటర్‌పై నయవంచన

ఉప్పుటేరుపై మూడు రెగ్యులేటర్లు నిర్మిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం పెద్ద హడావుడే చేసింది. మొగల్తూరు మండలం మోళ్లపర్రు వద్ద రెగ్యులేటర్ నిర్మాణానికి ఏకంగా జగన్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ రెగ్యులేటర్ల నిర్మాణం కోసం ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇవ్వలేదు. ప్రభుత్వ అనుమతులు వచ్చిన తర్వాతే టెండర్లు పిలుస్తారు. పనులు ప్రారంభిస్తారు. ఇవేమీ లేకుండా సీఎం శంకుస్థాపన చేసి కొత్త ఒరవడికి తెరతీశారు. జనం చెవిలో పూలు పెట్టారు.

సర్వే పూర్తి కాని వాటర్ గ్రిడ్

గ్రామీణ ప్రాంత ప్రజలకు టీడీపీ హయాంలో వాటర్ గ్రిడ్ పథకం మంజూరు చేశారు. అదే పథకానికి మళ్లీ ప్రతిపాదనలు రూపొందించి వైసీపీ హయాంలో ప్రాజెక్ట్ స్థాయిని తగ్గించారు. రూ.1,428 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకం ఏర్పాటు చేస్తున్నట్టు నర్సాపురంలో ముఖ్యమంత్రి చెప్పారు. అదే సభలో పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు సర్వే పనులు పూర్తికాలేదు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించలేదు. ఐదేళ్లపాటు వాటర్‌గ్రిడ్ పథకంపై కాలయాపనే జరిగింది.

నిధులివ్వని జీవోలు

ఏడాదిన్నర క్రితం సీఎం నరసాపురం వచ్చినప్పుడు ఒక రోజు ముందుగా పట్టణ ప్రజలకు తాగునీటి వసతి, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేసింది. ఆ మరుసటి రోజే జగన్ నర్సాపురం విచ్చేశారు. పట్టణంలో పైప్‌లైన్ ప్రాజెక్ట్, డ్రైనేజీ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. విశేషమేమిటంటే ఇప్పటికీ సదరు ప్రాజెక్ట్‌లకు ప్రతిపాదనలే లేవు.

నేడు నరసాపురానికి జగన్

నరసాపురం, మే 2: సీఎం జగన్ శుక్రవారం నరసాపురంలో ఎన్నికల ప్రచారానికి రానున్నారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం తొమ్మిది గంటలకు పట్టణంలోని టైలర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడి నుంచి స్టీమర్‌రోడ్డులోని కనకదుర్గ ఆర్చ్ వరకు బస్సు యాత్ర చేసి, సభలో ప్రసంగిస్తారు. తిరిగి 11.30 గంటలకు బయలుదేరి వెళతారు. సీఎం పర్యటనకు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రానికి బందోబస్తు నిమిత్తం పెద్ద ఎత్తున పోలీసులు చేరుకున్నారు. ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, ఎస్పీ అజిత, ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీనివాసరావు హెలిప్యాడ్, స్టీమర్ రోడ్డులను పరిశీలించారు.

నేడు కైకలూరులో పవన్ సభ

కైకలూరు, మే 2 : జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం కైకలూరులో పర్యటించనున్నారు. ఉదయం పిఠాపురం నుంచి నేరుగా హెలికాప్టర్‌లో కైకలూరు చేరుకుంటారు. బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి తాలుకా సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారు. ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. హెలిప్యాడ్ స్థలాన్ని గురువారం మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తాడినాడ బాబు తదితర నాయకులు పరిశీలించారు. కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ సభను విజయ వంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతోపాటు పవన్ కల్యాణ్, మెగా ఫ్యామిలీ అభిమానులందరూ పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో గతంలో పవన్‌కల్యాణ్ నిర్వహించిన సభలకంటే ఈ సభకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వశిష్టకు టెండర్‌లు ఏవి

గోదావరిపై వశిష్ట వారధి నిర్మిస్తామంటూ సీఎం హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు టెండర్లు ఖరారు కాలేదు. నిధులు మంజూరు కాగితాలకే పరిమితమైంది. నరసాపురం వాసుల వశిష్ట వారధి ఆశలు నెరవేరలేదు. మొగల్తూరులో సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసినా సరే ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. నియోజకవర్గంలో మాత్రం ప్రాజెక్టుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగింది. అధికార పార్టీ నేతను అంతా నమ్ముకున్నారు. తీరా ప్రాజెక్టులు లేకపోవడంతో అంతా పీకల్లోతు నష్టాల్లో ఉన్నారు.







ఆచంట, ఆకివీడు, ఇరగవరం బ్యాంకుల్లో పింఛన్‌ల కోసం వచ్చిన వృద్ధులు, దివ్యాంగులతో కిటకిట

పింఛన్ పాట్లు

వృద్ధులు, దివ్యాంగులతో బ్యాంకులు కిటకిట.. అకౌంట్‌లలో జమ కాని సొమ్ములు

డబుల్ అకౌంట్‌లతో ఇబ్బందులు.. మండే ఎండలో ఆపసోపాలు

భీమవరం/ఆచంట/తాడేపల్లిగూడెం రూరల్/ఇరగవరం/పెంటపాడు/ఆకివీడు/మొగల్తూరు, మే 2(ఆంధ్రజ్యోతి):జిల్లాలో మే నెలకు సంబంధించి పింఛన్‌ల ప్రక్రియ సరిగా జరగకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వారి పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఈ ప్రక్రియలో కొందరికి బ్యాంక్ అకౌంట్‌లో నగదు జమచేయగా మరికొందరికి ఆయా సచివాలయాల వద్దే ఇస్తున్నారు. జిల్లాలో 2.34 లక్షల మంది లబ్ధిదారులు వుండగా వారిలో 68 వేల మంది దివ్యాంగుల, అనారోగ్య బాధితులకు ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు. మిగిలిన వారికి బ్యాంకు ఖాతాలో జమచేశారు. చాలామంది బ్యాంకులకు వెళ్లి అడిగితే ఖాతా మురిగిపోయింది, రెన్యువల్ చేసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు. దీంతో గ్రామాల నుంచి పది కిలోమీటర్లు దూరంలోని బ్యాంకులకు వచ్చిన వృద్ధులు లబోదిబోమన్నారు. కొందరికి రెండు బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. అలాంటి వారు ఒక బ్యాంకుకు వెళితే పడ లేదని చెప్పారు. మరో ఖాతా ఉన్న బ్యాంకుకు వెళితే అక్కడా పడలేదంటూ చెప్పడంతో లబోదిబోమన్నారు. బ్యాంకులన్నీ పెన్షన్ లబ్ధిదారులతో కిటకిటలాడాయి. వృద్ధులపై బ్యాంకు సిబ్బంది చిర్రుబుర్రులాడారు. జిల్లాలో 4200 మంది కార్యదర్శులున్నారు. వారితో ఇంటి వద్దకే పెన్షన్ ఇచ్చే అవకాశం ఉన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో మండుటెండల్లో వృద్ధులు గ్రామాలు దాటి పట్టణాలకు విచ్చేశారు. అధికారుల తీరుతో బ్యాంకుల వద్ద మండు టెండలో పడిగాపులు కాయాల్సి వచ్చిందని లబ్ధిదారులు వాపోయారు. గత నెలలో సచివాలయాల వద్ద పెన్షన్లు అందజేయగా ఈసారి పింఛన్ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇది తెలియక లబ్ధిదారులు బుధవారం నుంచే సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. నేరుగా మీ ఖాతాలో జమ అవుతుందని అధికారులు, సిబ్బంది చావు కబురు చల్లగా చెప్పారని వాపోయారు. ఆధార్ కార్డుతో బ్యాంక్ ఖాతా లింక్ అయిన లబ్ధిదారు ఖాతాకు సొమ్ము జమచేశారు. అదీ ఒకేసారి కాదు అంచెలంచెలుగా వేశారు. ఎండకు తట్టుకోలేక చాలా మంది వృద్ధులు ఆటోలలో బ్యాంకులకు వచ్చారు.

ఎక్కడ చూసినా వృద్ధుల ఆపసోపాలు

- ఆచంట మండలంలో 8,258 మంది పింఛన్ దారులకు గాను 5,711 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేశారు. మరో 2,547 మందికి సచివాలయాల వద్ద ఇచ్చే ఏర్పాట్లుచేశారు. బ్యాంకులకు సంబంధించి అందరికి డబ్బులు జమ కాగా సచివాలయాల్లో మాత్రం ఇప్పటి వరకు 75 శాతం పింఛన్‌లు పంపిణీ జరిగింది. అయితే లబ్ధిదారులకు సంబంధించి బ్యాంకులు వద్ద ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఆయా బ్యాంక్‌లు వద్ద డ్వాక్రా సీఏలు, పంచాయతీ సిబ్బందిని ఏర్పాటుచేసి వారి ద్వారా బ్యాంక్‌ల వద్ద నుంచి పింఛన్‌లు తీసుకునే సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. అయితే కొందరి పింఛన్ దారులకు మాత్రం వారికి ఏ బ్యాంక్, ఎక్కడుందో తెలియక బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడ్డారు. ఆచంట ఎస్‌బీఐలో పింఛన్ లబ్ధిదారులకు ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో మజ్జిగ సరఫరా చేశారు.
- తాడేపల్లిగూడెం పట్టణ, గ్రామాల్లో పింఛన్ సొమ్ము బ్యాంకుల్లో జమ కావడంతో పింఛనుదారులంతా గురువారం బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. ఒక పక్క ఉక్కపోత, మరో పక్క ఎండ తీవ్రతతో పింఛన్ సొమ్ము కోసం వారు బ్యాంకుల వద్ద క్యూకట్టారు. దీంతో తాడేపల్లిగూడెంలోని బ్యాంకులన్ని కిక్కిరిశాయి.
- ఇరగవరం మండలంలో పింఛన్ల పంపిణీ తీరుపై లబ్ధిదారులు గుర్రుమంటున్నారు. అసమర్థ నిర్ణయం వల్ల వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర కష్టాలు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండలో బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకులకు వచ్చిన పెన్షనర్లు చాలా మందికి తమ ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ కాకపోవడంతో లబోదిబోమంటున్నారు.
- పెంటపాడు మండలంలో 9,995 మంది లబ్ధిదారులకు గాను 2,815 మంది ఇంటింటికి వెళ్లి ఇవ్వాల్సి ఉందని మండల పరిషత్ అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాలలో 7180 మందికి గాను 7,053 మందికి నగదు జమైందని, 127 మందికి జమ కావాలి. 2,815 మందికి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇవ్వాల్సి వుండగా ఇప్పటి వరకు 2438 మందికి ఇచ్చామన్నారు.
- మొగల్తూరు మూడో గ్రామ సచివాలయం వద్ద గురువారం ఉదయం నుంచి పింఛన్ లబ్ధిదారులు రోడ్డు మీదనే కూర్చుని డబ్బుల కోసం పడిగాపులు కాశారు. తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బుల వేశారా లేదా అనే విషయం కచ్చితంగా తెలియని పలువురు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు.
- టీడీపీ, జనసేన, బీజేపీలు ఎప్పటి మాదిరిగానే ఇళ్ల వద్దే పింఛన్లు అందజేయాలని అధికారులను కోరినా జగన్‌కు వత్తాసు పలికేందుకే ఈ రెండు నెలలు పింఛనుదారులకు అష్టకష్టాలు పెట్టారని విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతీ నెలా ఒకటో తేదీనే పింఛనుదారులకు ఇళ్ళ వద్దనే పింఛను నగదు అందజేస్తారని వారు చెబుతున్నారు.

నాలుగు రోజుల తర్వాత రమ్మన్నారు



- పింఛను బ్యాంకు ఖాతాలో పడుతుందని సచివాలయ సిబ్బంది చెప్పారు. బ్యాంకుకు వచ్చాక పాస్ పుస్తకం చచ్చిపోయింది, అది బతికించాలంటే నాలుగు రోజులు పడుతుందన్నారు. అప్పుడు వచ్చి డబ్బులు తీసుకోండంటున్నారు. ఎంతో కష్టపడి వచ్చాను. మళ్ళీ రావాలంటే ఎండలకు భయం వేస్తోంది.

- పోతాబత్తుల సత్యవతి, వేల్పూరు



పెదపుల్లేరులో మోటరు సైకిల్ ర్యాలీలో బైక్‌పై నుంచి విక్టరీ సింబల్‌ను చూపిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే మంతెన రామరాజు

అందుబాటులో ఉంటా

నియోజకవర్గ ప్రజలకు టీడీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామ హామీ

ఉండి, మే 2 : నియోజకవర్గ ప్రజలందరికి అందుబాటులో వుండి సేవలందిస్తానని ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం ఉండి మండలం వాండ్రం, చినపుల్లేరు, పెదపుల్లేరు, మేడవరం, కలిసిపూడి, చెరుకువాడ, అర్తమూరు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నియోజకవర్గాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతా. ఇందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తున్నాం. నేను గెలిస్తే ఇక్కడ ఉండననే అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఇది సరికాదు. ఎంపీగా ఎన్నికై ఆరు నెలలు ఇక్కడే వున్న విషయం అందరికి తెలుసు. సీఎం జగన్ కుయుక్తుల వల్ల ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఉండాల్సి వచ్చింది. నేను ఎక్కడున్నా నా పార్లమెంట్ పరిధిలోని ఉండి నియోజకవర్గంలో మంచినీరు, రోడ్ల అవసరాలకు కోట్లాది రూపాయలు మంజూరు చేశా. ఎవరు ఎలా నాపై దుష్ప్రచారం చేసినా ప్రజలు, ఓటర్లు నమ్మే స్థితిలో లేరు. వైసీపీ ప్రభుత్వం దెబ్బతో ఆక్వా దెబ్బ తిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుతం ఏర్పడగానే ఆక్వా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా' అని అన్నారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, జనసేన ఇన్‌చార్జ్ జుత్తుగ నాగరాజు మాట్లాడుతూ రఘురామను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కందుల బలరాం, నడింపల్లి సత్యనారాయణరాజు, యిర్రింకి బుజ్జి, కరిమెరక నాగరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, జుత్తుగ శ్రీనివాస్, తోట రాము, యడవల్లి వెంకటేశ్వరరావు, గేదెల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

శివరామరాజుపై

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

భీమవరం, మే 2(ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వేటుకూరి శివరామరాజుపై టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేసింది. వామపక్ష భావజాలం వున్న పార్టీపై నామినేషన్ దాఖలు చేసిన ఆయన స్వతంత్ర అభ్యర్థిగా ప్రచారం చేసుకోవడాన్ని తప్పు పట్టింది. టీడీపీ న్యాయవాది ఆ మేరకు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారుల వెల్లడించారని రఘురామరాజు తెలిపారు. కలిదిండి అబ్బాయిరాజు, ఎన్టీఆర్ ఫోటోలను వాడుకుంటున్నారు. అబ్బాయిరాజు తనయుడికి ఏఎంసీ చైర్మన్ ఇస్తామని శివ అప్పట్లో మోసం చేశారు. మరొకరికి ఆ పదవి కట్టబెట్టారు. ఇలా మోసానికి పాల్పడి అబ్బాయిరాజు ఫోటో ఎలా ఉపయోగించుకుంటున్నారని రఘురామ ఎద్దేవా చేశారు.



ప్రతి రూపాయికీ లెక్క చెప్పాలి

భీమవరం టౌన్, మే 2:రాజకీయ పార్టీల అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా సూచించారు. ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న 21 మంది ప్రచార వ్యయాల రిజిస్టర్లను గురువారం కలెక్టరేట్‌లో శుక్లా పరిశీలించారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను అనుసరించి, ప్రచారాల ఖర్చులు ఉండాలి. ప్రచార ఖర్చులను షాడో బృందాలు, ఎంసీఎంసీ సెల్ గుర్తిస్తాయి. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు ప్రకారం పార్టీల అభ్యర్థులు నడుచుకోవాలి. అభ్యర్థులు సువిధ యాప్ ద్వారా ముందస్తు అనుమతులు తీసుకుని సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలి. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినట్లు ప్రింటర్, ప్రచురణకర్తలు ఎన్నికల ప్రాతినిధ్యం చట్టం ప్రకారం నిబంధనలు పాటించాలి. ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చును మాత్రమే చేయాలి. నిబంధనలను అతిక్రమించి ఎక్కువ ఖర్చు చేస్తే అనర్హత వేటు పడుతుంది. వ్యయ పరిశీలకుల సహాయకులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వివిధ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆచంటకు పూర్వ వైభవం తీసుకొస్తా

ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యే రంగనాథరాజు అవినీతి అక్రమాలతో పాలన సాగించారు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆచంట టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ

'ముసకబారిన ఆచంట నియోజకవర్గానికి పూర్వ వైభవం తేవాలన్నదే నా సంకల్పం. ఆచంట ప్రజలకు శాశ్వత తాగు నీటి పథకంతోపాటు లంక గ్రామాల శతాబ్దాల కలగా మిగిలిన గోదావరిపై వారధి నిర్మించాలనేది నా జీవితాశయం. ఆచంటకు అగ్ని మాపక కేంద్రం, గ్రామాల్లో విలేజ్ జిమ్ సెంటర్లు, అర్హులైన లబ్ధిదారులకు రెండు సెంట్ల భూమి, ఇళ్ల నిర్మాణం, అవినీతి రహిత పాలన, ఉచిత ఇసుకతో భవన నిర్మాణ కార్మికులకు తోడ్పాటునిస్తా' అంటూ ఆచంట కూటమి తరపున టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ చెప్పారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

- పెనుమంట్ర

నేను - నా ఆచంట - చేసిన అభివృద్ధి

- నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా వున్న ఆ ఐదేళ్లలో ఆచంట నియోజకవర్గంలో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. ఇది ఆల్ టైం రికార్డు. రూ.72 కోట్లతో 2,980 మందికి పక్కా గృహాలు కట్టించాం. రూ.9 కోట్లతో ఆర్‌వో ప్లాంట్‌ల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాం. వందకుపైగా అంగన్వాడీ భవనాలు, 30 వేల మరుగుదొడ్లు, 98 శాతం సిమెంట్ రోడ్లు, అన్ని కులాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించాం. రూ.250 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని ఆర్‌అండ్‌బీ రహదారుల నిర్మాణం చేపట్టాం. ఇలా చెప్పుకుంటూ వెళితే చాలానే ఉన్నాయి.

రంగనాథరాజు హయాంలో అటకెక్కిన అభివృద్ధి

- ఆచంట గ్రామాల వారధి నిర్మాణానికి రూ.150 కోట్లు తెస్తే ఆ నిధులను మూలన పడేశారు ఎమ్మెల్యే రంగనాదరాజు. ఐదేళ్లలో ఆయన చెప్పినవన్ని అబద్ధాలే. చేసినవన్నీ దోపిడీలు, అరాచకాలు. వశిష్ట గోదావరిపై వారధి నిర్మాణం, ఎస్.ఇల్లిందలపర్రు లాకు నిర్మాణం, ఆచంటకు అగ్నిమాపక కేంద్రం, గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా శుద్ధి చేసిన తాగు నీరు ప్రతీ ఇంటికి అందిస్తానని హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్న ఆయన ఏ ఒక్కటీ నెరవేర్చలేదు.

అంతటా అవినీతి.. అక్రమాలు

- ఎమ్మెల్యే అంటే నిత్యం ప్రజా సమస్యలు తెలుసుకుంటారు.



ఈ ఎమ్మెల్యే ఎవరైనా తన ఆఫీసుకు వస్తే మీరేందుకు వచ్చారు పొండి అంటూ చీదరించుకుంటాడు. వశిష్ట గోదావరిలో సిద్ధాంతం, చినమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, ఇసుక ర్యాంపుల్లో ఇసుకను దోచేశారు. ఇళ్ల స్థలాల్లో రూ.28 కోట్ల అవినీతికి పాల్పడ్డాడు. తన అక్రమాలను ప్రశ్నించిన వారిపై ఆకు రౌడీలా రెచ్చిపోతాడు. సిద్ధాంతంలోని గోదావరిని నమ్ముకుని జీవిస్తున్న 1030 మంది మత్స్యకార్మిక కుటుంబాలను ఉపాధి లేక ఇబ్బందులకు గురిచేశాడు. నక్కవారిపాలెంలో కాపుల కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తే, నిర్మాణం చేయకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కాపు కమ్యూనిటీ నాయకులు ప్రశ్నిస్తే వారిపై ఒంటి కాలిపై లేచాడు. ఇప్పుడు ఓటు అడిగేందుకు వెళితే వారి నుంచి తిరుగుబాటు ఎదురైంది. అటువంటి ఘనుడు ఎమ్మెల్యే రంగరాజు. తాను చెప్పినట్లు చేయని అధికారులను సెలవుపై వెళ్లిపొమ్మని ఆదేశిస్తాడు. నేను చెప్పిందే శాసనం ఎదురు చెప్పేవాడు ఎవడు అంటూ ఊగిపోతాడు.

విధ్వంస పాలనపై ఐదేళ్లుగా ఉద్యమాలు

- రాష్ట్రంలో జగన్ సర్కార్ విధ్వంసకర, అవినీతి పాలనపై ఐదేళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తూనే వున్నాం. సామాన్యుల నడ్డి విరిచే విధంగా పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్, ఆర్టీసీ బస్సు చార్జీలపై బాదుడే బాదుడు చేపట్టాం. రహదారులపై గుంతలు పూడ్చాలంటూ ఆందోళనలు చేశాం. కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులపై నిరసనలు, అన్నదాతను లూటీ చేసిన ప్రభుత్వంపై రైతు పోరు, ఉచిత ఇసుకను 40 వేలకు విక్రయిస్తే భవన నిర్మాణ కార్మికులతో కలసి ఇసుకపై పోరాటాలు చేశాం. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు గ్రామాల్లో రచ్చబండలు నిర్వహించాం. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 54 రోజులలో దీక్షా శిబిరాన్ని నిర్వహించి వినూత్న నిరసన వ్యక్తం చేశాం. చెత్త పన్నుపై చెత్త ప్రభుత్వాన్ని నిలదీశాం.

కూటమి సహకారం

- తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పరస్పర సహకారంతో ముందుకు వెళ్తున్నాం. ఆచంటలో నా పాలన, రంగనాథరాజు పాలనను ప్రజలు బేరీజు వేసుకున్నారు. నన్ను గెలిపించేందుకు సిద్ధమయ్యారు. అలాగే ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాబోతుంది. నర్సాపురం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే గెలుస్తున్నారు.

నా ఎస్సీలు అంటావ్ కద జగనన్నా..



నా ఎస్సీలు అంటావు కద జగనన్నా.. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గానికి ఏం చేశావని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇక్కడికి వచ్చావు అధికారంలోకి వస్తే ఏం చేస్తావో చెప్పలేకపోయావు. అధికారం వచ్చాక కూడా వచ్చావు. ఏం చేశావని ప్రశ్నిస్తున్నారు. పామాయిల్ రైతులకు మొండిచెయ్యే..!

గోపాలపురం

అభివృద్ధిలో వివక్ష



గోపాలపురం నియోజకవర్గంలో ప్రతిపక్ష హోదాలో ఎన్నికల ముందు జగన్ పాదయాత్ర నామమాత్రంగా సాగింది. నియోజకవర్గానికి మేలు చేసే హామీలు లేవు. అధికారంలో ఉండగా మరోసారి వచ్చినా నియోజకవర్గ ప్రజలకు నిరాశే. ప్రతిపక్ష హోదాలో వచ్చిన జగన్ ముందు పామాయిల్ రైతుల ఒక సమస్య ఉంచారు. పామాయిల్ గెలలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అదే కాదు ఒకటి.. అర.. హామీలు కూడా గాలికొదిలేశారు. గోపాలపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో వివక్ష చూపారని, అభివృద్ధిలో చిన్నచూపు చూశారని నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. హామీలు ఇవ్వడానికే వెనకాడారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నా ఎస్సీలు అంటూ ఊదరగొట్టే జగన్ ఐదేళ్లలో ఏం చేశారని ఎస్సీలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - గోపాలపురం

పామాయిల్ రైతులను పట్టించుకోలేదు



గత ఎన్నికలకు ముందు పాదయాత్రగా నియోజకవర్గానికి వచ్చిన జగన్ వద్ద పామాయిల్ రైతులు సమస్యలు వివరించారు. గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నామని వాపోయారు. అధికారంలోకి వచ్చాక పామాయిల్‌కు మంచి ధర ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం కంటె మన రైతులకు ఎక్కువ ధర ఇస్తామని నమ్మబలికారు. జగన్ హామీతో రైతులు సంబరపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీ మరిచిపోయారు. పామాయిల్ ధరలు మరింత పతనం కాగా ఇక్కడి రైతులను తెలంగాణ మార్కెట్‌కు రానివ్వలేదు. పామాయిల్ రైతులను జగన్ నిర్లక్ష్యం చేశారని వాపోతున్నారు.

• పామాయిల్ గిట్టుబాటు ధర లేదు • పోలవరం కుడి కాల్వ నిర్వాసిత రైతులకు పరిహారం లేదు • ఎర్ర కాల్వ పనులు లేవు • నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారు

ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన గోపాలపురంలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పాదయాత్రలో భాగంగా నియోజకవర్గానికి వచ్చిన జగన్ కనీసం హామీలు కూడా ఇవ్వలేదని ప్రజలు మండిపడుతున్నారు. పామాయిల్‌కు గిట్టుబాటు ధర కావాలని రైతులు నోరు తెరచి అడిగితే తెలంగాణ కంటె ఎక్కువ ఇస్తామని గొప్పగా చెప్పారని, అధికారంలోకి వచ్చాక మొండిచెయ్యి చూపారన్నారు. పోలవరం నిర్వాసితుల్లో భాగమైన కుడికాల్వ తవ్వకాల్లో భూములు కోల్పోయిన రైతులకు రూ.5 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేక జగన్ చేతులెత్తేశారని నియోజకవర్గ ప్రజలు మండి పడుతున్నారు.

పోలవరం కుడి కాల్వపై అసంపూర్తి వంతెన

దేవరపల్లి మండలంలో పోలవరం కుడి ప్రధాన కాల్వపై లక్ష్మీపురం వద్ద టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టింది. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక వంతెన నిర్మాణం వైపు ప్రజాప్రతినిధులు, అధికారులు కన్నెత్తి చూడలేదు. దేవరపల్లి - లక్ష్మీపురం మధ్య కిలోమీటరు దూరం ప్రయాణానికి చుట్టు తిరిగి 5 కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోంది. రైతులు, విద్యార్థులు, కూలీలు, వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. కోరుమామిడి, చిక్కాల ప్రధాన రహదారి నిర్మిస్తానని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పలుమార్లు భూమి పూజలు చేశారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకున్నారు. రహదారి నిర్మాణం మాత్రం చేయలేదు.

నిలిచిపోయిన ఎర్ర కాల్వ, కుడికాల్వ పనులు

నల్లజర్ల మండలంలో పోతవరం నుంచి పుల్లలపాడు వరకు ఎర్రకాల్వ, కుడి కాల్వ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఆ కాల్వ వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో 15కిలోమీటర్ల మేరా 7వేల ఎకరాలకు నీరందక సాగుభూములు బీడుభూములుగా మారాయి. నల్లజర్ల మండల కేంద్రంలో గత టీడీపీ ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండ్ నిర్మించింది. తర్వాత రాజమండ్రి - ఏలూరు వెళ్ళే జాతీయ రహదారి నిర్మాణంతో బస్సులు హైవే మీదుగా వెళుతున్నాయి. దీనితో కాంప్లెక్స్‌కు బస్సులు రాక ప్రయాణికులు నానాతంటాలు పడుతున్నారు. ఐదేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకున్నా వారే లేరు.

మంచినీటికి కటకట

మెట్ట ప్రాంత ప్రజల దాహార్తి తీర్చే శ్రీసత్యసాయి మంచినీటి సేవా పథకం కార్మికులకు ఐదేళ్లుగా జీతాలు లేక విలవిలాడుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాలుగు నియోజకవర్గాల పరిధిలో 15 మండలాలకు తాగునీరు సరఫరా అవుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్ల క్రితం కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో సుమారు ఏడాది పాటు నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రతిపక్షాల పోరాటాలతో ఎట్టకేలకు పథకం కొనసాగిం చారు. ప్రస్తుతం ఐదు నెలల నుంచి మంచినీటి పథకం కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో నానా తంటాలుపడుతున్నారు.



నల్లజర్లలో ఎర్ర కాల్వ గట్టు పనులు



అధ్వానంగా త్యాజంపూడి - కోరుమామిడి రహదారి



రాళ్లు, గోతులతో ద్వారకా తిరుమల - రాజుపాలెం రహదారి



యర్నగూడెం రోడ్డు (ఫైల్)

నియోజకవర్గంలో ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల మండల రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులు ఈ రహదారుల వెంబడి వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మండల కేంద్రమైన ద్వారకాతిరుమలతో పాటు పరిసర గ్రామాల రహదారులు గుంతలు పడి, రాళ్లు లేచి కనీసం నడిచేందుకు వీలులేని పరిస్థితిలో ఉన్నాయి. తిమ్మాపురం నుంచి రామన్నగూడెం, తిరుమలంపాలెం నుంచి రాజుపాలెం మీదుగా మారంపల్లి రహదారి, పంగిడిగూడెం - వేంపాడు రహదారులు పూర్తి అధ్వానంగా మారాయి. ఐదేళ్లుగా రహదారుల నిర్మాణం కాదు కనీసం మరమ్మతు పనులు కూడా చేపట్టలేదు.



నల్లజర్లలో అలంకారప్రాయంగా మిగిలిన ఆర్టీసీ బస్టాండ్

నెరవేరని హామీలు

- పామాయిల్ రైతులకు తెలంగాణ కంటె అధిక ధరలు ఇస్తామని జగన్ హామీ ఐదేళ్లుగా అమలుకు నోచుకోలేదు.
- పోలవరం ప్రాజెక్ట్‌లో భాగమైన కుడి కాల్వకు భూములు ఇచ్చిన రైతులకు రూ.5లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదు.
- దేవరపల్లి మండలంలో పోలవరం కుడి ప్రధాన కాల్వపై లక్ష్మీపురం వద్ద ప్రజల రాకపోకల నిమిత్తం నిర్మించాల్సిన వంతెన నిర్లక్ష్యం చేశారు.
- కోరుమామిడి, చిక్కాల ప్రధాన రహదారి నిర్మిస్తానని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పలుమార్లు భూమిపూజలు చేశారు. సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేసుకున్నారు. పనులు మాత్రం చేపట్టలేదు.
- నల్లజర్ల మండలంలో పోతవరం నుంచి పుల్లలపాడు వరకు ఎర్రకాల్వ, కుడి కాల్వ నిర్మాణం పనులు గాలికొదిలేశారు.
- మెట్ట ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు శ్రీసత్యసాయి మంచినీటి సేవా పథకం కార్మికులకు వేతనాల చెల్లింపులో ముప్పు తిప్పలు పెడుతున్నారు.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో నల్లజర్లలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు లేవు. ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోరు.
- ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల మండలంలో రహదారులు అధ్వానం. రహదారుల నిర్మాణంపై ఐదేళ్లుగా పట్టనట్లు గడిపేశారు.

ఎన్నికల ప్రచార చిత్రం

అభిమానం



నరసాపురంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.

గబ్బర్‌సింగ్



భీమవరంలో గబ్బర్‌సింగ్ కమెడియన్ల ప్రచారం

RRR సెల్ఫీ



కష్టే ఫలి..





భర్త విజయం కోరుతూ భార్య, తండ్రిని గెలిపించాలని కుమారుడు వినూత్న ప్రచారంతో ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. తణుకు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ భార్య కృష్ణ తులసి, కుమారుడు నిఖిల్ రత్న నియోజకవర్గంలో వేర్వేరు చోట్ల ప్రచారం చేస్తున్నారు. కృష్ణ తులసి ప్రచారంలో భాగంగా మహిళలను ఓట్లు అభ్యర్థించడానికి వెళ్లి ఒక చోట కుట్టుమిషన్‌పై కొంత సేపు బట్టలు కుట్టి సందడి చేశారు. మరో మండలంలో నిఖిల్ రత్న ఓట్లు అభ్యర్థిస్తూ ఒక చోట లాండ్రిలో ఇస్త్రీ చేసి ఓటర్లను ఆకట్టుకున్నారు.



ఇస్త్రీ చేస్తూ.. ఓట్లు అడుగుతున్న పత్సమట్ల ధర్మరాజు

సైకిల్‌పై కార్మిక



గీత కార్మికుడిగా సైకిల్‌పై నిమ్మల ప్రచారం

జనసేన చీరలు

ఎన్నికల ప్రచారంలో జనసేన చీరలు మహిళలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. జనసేన పార్టీ గుర్తుతో పాటు, ఎన్నికల గుర్తు గ్లాస్ ముద్రించిన చీరలు ధరించి మహిళలు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఆచంటలో జనసేన చీరల మహిళలు ఇలా సందడి చేశారు.





మామ గారిని గెలిపించాలని పితాని కోడలు సాహితి పెనుమంట్ర మండలంలో ప్రచారం చేశారు

Hai చింటూ



ప్రచారంలో చిన్నారితో సరదాగా ఆరిమిల్లి



తోడికోడళ్ల ప్రచారం

ఏలూరులో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి విజయానికి కుటుంబ సభ్యులు ప్రచారం చేస్తున్నారు. కుటుంబంలో తోడికోడళ్లు ఇద్దరూ ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించడంతో మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. చంటి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సతీమణి రేణుకమ్మ, చంటి భార్య మీన కలసి కార్యకర్తలతో పాటు ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం చేస్తున్నారు. వారికి తోడుగా బుజ్జి అల్లుడు కొట్టు మనోజ్ గత కొన్ని రోజులుగా ప్రచారం చేస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కుటుంబమంతా బడేటి చంటి విజయానికి కృషి చేస్తున్నారు. - ఏలూరు టూటౌన్



ఎక్స్‌కవేటర్‌తో రహదారిపై డివైడర్ల తొలగింపు

జగన్ వస్తే.. విధ్వంసమే

నరసాపురంలో డివైడర్ తవ్వేశారు

నరసాపురం, మే 2: ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అయినా అధికారులు మాత్రం ఇంకా జగన్ మత్తులోనే జోగుతున్నారు. ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురం వస్తున్నారు. స్టీమర్ రోడ్డులో శుక్రవారం వైసీపీ సభ నిర్వహిస్తారు. సభకు అనువుగా రహదారిపై డివైడర్లను గురువారం రాత్రి ఎక్స్‌కవేటర్లతో తవ్వేశారు. కొద్ది రోజుల క్రితం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభలు కూడా అదే రహదారిలో ఏర్పాటు చేశారు. అప్పుడు అడ్డురాని డివైడర్లు జగన్ రెడ్డి సభకు అవరోధం కల్పిస్తున్నాయా అని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హోదాలో వచ్చినప్పుడు రోడ్డుకు ఇరువైపులా చెట్లు తొలగించారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారానికి వస్తున్న జగన్‌కోసం డివైడర్‌లను ధ్వంసం చేశారు. అందుకోసం మున్సిపల్ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లను ఉపయోగించారు. దీనిపై జగన్ వస్తే విధ్వంసమేనని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

వైసీపీ అభ్యర్థి 420..

ఓటు వేస్తే మోసం చేస్తారు

మాజీ సర్పంచ్ కృష్ణవేణి ఆడియో కలకలం

పాలకొల్లు రూరల్, మే 2: పాలకొల్లు వైసీపీ అభ్యర్థి గుడాల గోపి 420.. అతడికి ఓటు వేయవద్దు అంటూ ఒక మాజీ సర్పంచ్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి మాట్లాడిన ఆడియో కలకలం రేపింది. ఆచంట నియోజవర్గం శేషమ్మచెరువు మాజీ సర్పంచ్ మామిడిశెట్టి కృష్ణవేణి పాలకొల్లు వైసీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాల రావు (గోపి)పై మాట్లాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. గోపి తనకు రూ.32 లక్షలు ఇవ్వాలని, తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ము ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గుడాల గోపి 420 అని, ప్రజలు ఎవరూ ఓటు వేయవద్దంటూ కోరారు. తాను యలమంచిలి మండలం కాజ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు గుబ్బల వేణు సోదరినని (గుడాల గోపి సామాజిక వర్గం కూడా అదే) తెలిపారు. నియోజకవర్గ ప్రజలు మోసగాడికి ఓటు వేయవద్దని.. ఏ పనికైనా డబ్బులు వసూలు చేస్తాడని కృష్ణవేణి విడుదల చేసిన ఆడియో ఇప్పుడు నియోజకవర్గంలో పెను సంచలనం కలిగిస్తోంది.

రాజీకీయం

నాడు ప్రత్యర్థులు.. నేడు ఒక్కటై ప్రచారం



రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో...ఎవరూ చెప్పలేరు. శత్రువులు మిత్రులవుతారు. ఒక్కోసారి మిత్రులే శత్రువులై పోటీలో ఉంటారు. ఇలాంటి చిత్ర విచిత్రాలు ఎన్నికల్లోనే చూస్తుంటాం. అలాంటి సంఘటనే నరసాపురంలో చోటు చేసుకుంది. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు నేడు ఒక్కటయ్యారు. గెలుపు కోసం అంతా కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా నాయకర్ పోటీలో ఉంటే టీడీపీ అభ్యర్థిగా బండారు మాధవనాయుడు ఉన్నారు. ఇటు కొత్తపల్లి వైసీపీలో చేరి ముదునూరి విజయం కోసం కృషిచేశారు.అయితే నేడు ఈ ముగ్గురు ఒక్కటయ్యారు. కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న నాయకర్ విజయం కోసం ప్రచారం చేస్తున్నారు. నాయకర్‌ను గెలిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

-నరసాపురం

పాలిట్రిక్స్

ఎంత పనున్నా ఆ..రోజు రావాల్సిందే..



" ఈసారి ఎన్నికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. మన అభ్యర్థిని తప్పనిసరిగా మనందరం కలిసి గెలిపించుకోవాలి. మీకు ఎంత పని ఉన్నా ఓటు వేసే సమయానికి మాత్రం ఊరులో ఉండాల్సిందే." అంటూ గ్రామాల్లో ఉన్న ఓటర్లను వివిధ పార్టీలకు సంబంధించిన నేతలు ఫోన్‌లు చేసి సమాయత్తం చేస్తున్నారు. ఫోన్ కలవకపతే మెసేజ్‌ల రూపంలో పిలుస్తున్నారు. "ఎపుడూ లేనివిధంగా ఈసారి ఇరు పార్టీల మధ్య ఎన్నికలు హోరా హోరీగా జరుగుతున్నాయి. కాబట్టి ఆ సమయానికి వీలు చూసుకొని ఓటు వేయడానికి రావాల్సిందే." అంటూ పిలుస్తున్నారు. గ్రామంలో ఓటు ఉండి వేరే ప్రాంతాల్లో ఉంటున్నవారిని గుర్తించి వారికి ఫోన్లు చేస్తున్నారు.

-ఆచంట

ఎట్టెట్టా..!

జెండా పట్టండి..సొమ్ములు పొందండి..



నాయకులు ప్రచారానికి వెళితే కార్యకర్తల,అభిమానులకు వెన్నంటి ఉండేవారు. ఎన్నికలంటే పండగలా సాగేది. ఇప్పుడు ఎండలు మండిపోతున్నాయి. ఎవరూ బయటకు రాలేని పరిస్థితి. ప్రచారానికి వెళితే పట్టుమని పదిమంది కూడా ఉండని పరిస్థితి. దీంతో పెయిడ్ వర్కర్లను పురమాయిస్తున్నారు. మహిళలకు రూ.300 ఇస్తున్నారు. రెండు పూటలైతే రూ.600 చేతిలో పెడుతున్నారు. వైసీపీలో ఇటువంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. మహిళలకు డబ్బులిచ్చి ప్రచారానికి రప్పిస్తున్నారు. గతంలో పొలం పనులకు వెళ్లేవారు. ఇప్పుడంతా యంత్రాలతో పని జరిగిపోతోంది. దీంతో ఈ ఎన్నికలు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయి.జెండా పట్టుకుని ప్రచారానికి వెళ్లిపోతున్నారు. సాయంత్రానికి సొమ్ము పెట్టుకుని ఇంటికి వెళ్తున్నారు.

-భీమవరం రూరల్

ఎన్నికళలో..

అన్ని పార్టీలకు అదే గొంతు..





ఎన్నికలైనా, వాణిజ్య ప్రకటనలైనా, ఆధ్యాత్మిక ప్రకటనలైనా ఒకే ఒక్కడు పాలకొల్లులో తన గొంతును పలికిస్తాడు. అతని వాయిస్‌ను పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజక వర్గాల్లో ప్రతీ ఒక్కరూ గుర్తిస్తారు. మనిషి తెలియకపోయినా, మాటను బట్టి గుర్తు పట్టే విధంగా అతని వాయిస్ ఉంటుంది. కంచు కంఠం అని అందరూ అంటుంటారు. అతని పేరు బాలు.ముద్దుగా అందరూ మైక్ బాలు అంటూంటారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు కొందరు ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థులు కూడా బాలు వాయిస్‌ను రికార్డ్ చేసి ప్రచార వాహనాల్లో మైక్‌ల ద్వారా వినిపిస్తున్నారు. తెల్లవారగానే బాలు వాయిస్‌తో కూడిన ఎన్నికల ప్రచారం చేసే ఆటో రోడ్లపైకి వస్తుంది. టీడీపీ అభ్యర్థి డాక్టర్ నిమ్మలకు, ఎంపీ అభ్యర్థి శ్రీనివాస వర్మకు ఓటు వేయాలంటూ ప్రచారం చేసుకుంటూ వెళ్లిన ఐదు నిమిషాల్లో మరో వీధి నుంచి వచ్చిన ఆటోలో అదే గొంతు వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండంటూ ప్రచారం చేస్తూ వస్తుంది.దేవుడు ఇచ్చిన వరం తన గొంతు అని, అది ఇలా పొట్ట కూటికోసం ఉపయోగపడుతోందని బాలు చెబుతున్నారు.

-పాలకొల్లు రూరల్

ఇదీ సంగతి !

రండి బాబు..రండి !



ఎన్నికల ప్రచారానికి అధికార పార్టీకి కార్యకర్తల నుంచి స్పందన కరువైంది. పార్టీలో ఐదేళ్ల నుంచి ఉంటున్నా ఏం ప్రయోజనం లేకుండా పోయింది. ఎన్నికలప్పుడు కార్యకర్తలు గుర్తుకొస్తున్నారు.. అంటూ పెదవి విరుస్తున్నారు. ప్రచారానికి రావాలంటూ అభ్యర్థులు ఆహ్వానాలు పంపుతున్నా కార్యకర్తల నుంచి మాత్రం స్పందన ఉండడం లేదు. ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు ఏం పొందలేక పోయాం.. ఒకవేళ అధికారం కోల్పోతే మారిన ప్రభుత్వంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని కొంతమంది కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. మరోపక్క కూటమి అభ్యర్థుల ప్రచారం సందడిగా ఉంటోంది. ర్యాలీలలో వందలాది మంది వస్తున్నారు. అయితే అధికార పార్టీ అభ్యర్థులైతే పట్టుమని 20 మంది కూడా ఉండటం లేదు. దీంతో తాయిలాలు ఎర చూపి ప్రచారానికి ఆహ్వానం పలుకుతున్నారు..అలా అయినాసరే కొద్దిమందే వస్తున్నారు.


- భీమవరం రూరల్

కొల్లేరు కిలకిల..

కైకలూరు నియోజకవర్గం రాజకీయంగా చైతన్యవంతమైనది. ఇప్పటివరకు మూడుసార్లు స్వతంత్ర్య అభ్యర్థులు గెలుపొందారు. రెండుసార్లు మంత్రి పదవులు వరించాయి. పార్టీలకన్నా వ్యక్తులకే ప్రాధాన్యం ఇస్తారు ఇక్కడి ఓటర్లు. ఈ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల్లోని పలు గ్రామాలు బంటుమిల్లి మండలంలోని పలు గ్రామాలతో ఏర్పడింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో ముదినేపల్లి మండలం, మండవల్లి మండలం పూర్తిగా కైకలూరు నియోజకవర్గంలోకి చేరాయి. ప్రస్తుతం కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రంగా కైకలూరు ఉన్నప్పటికీ నేటికి గ్రామ పంచాయతీగానే ఉంది. **- కైకలూరు**



ఫ్లాష్ బ్యాక్



నియోజకవర్గాల పునర్విభజనకు ముందు కైకలూరు నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోటగా పేరొందింది. 2009లో పునర్విభజనతో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది. 72 సంవత్సరాల్లో 16 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో అత్యధికంగా ఓసీ సామాజికవర్గానికి చెందినవారే గెలుపొందారు. జయమంగళ వెంకటరమణ ఒక్కరు మినహా మిగిలిన వారంతా ఓసీ అభ్యర్థులే. అప్పటికి అత్యధికంగా కనుమూరి బాపిరాజు నాలుగుసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి, ఎర్నేని రాజరామచందర్ మూడుసార్లు గెలుపొందారు. కమ్మిలి అప్పారావు రెండుసార్లు, చెన్నంశెట్టి పాండురంగారావు, కమ్మిలి మంగ తాయారమ్మ ఒకసారి, నంబూరి వెంకటరామరాజు ఒకసారి గెలుపొందారు. ముదినేపల్లి మండలం కైకలూరు నియోజకవర్గంలో విలీనం చేయడంతో ఆ మండలంలో ఉన్న బీసీలు, ఓసీ వర్గాలకు చెందిన వారంతా తెలుగుదేశం పార్టీకి మద్దతు చూపడంతో పార్టీకి మరింత పట్టు పెరిగింది. దీంతో 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ గెలుపొందగా, 2014లో కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గెలిచారు. టీడీపీ అధికారం చేజిక్కించుకోవడంతో కామినేని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో హోరాహోరీగా పోటీపడిన జయమంగళ వెంకటరమణ ఓటమి పాలవ్వడంతో వైసీపీ నుంచి దూలం నాగేశ్వరరావు 9357 ఓట్ల తేడాతో గెలుపొందారు.



శ్యామలాంబ అమ్మవారి ఆలయం



- ఆహ్లాదాన్ని అందించే కొల్లేరు పర్యాటకం
- ఆధ్యాత్మికతను చాటే ఆలయాలు
- ఆక్వా ఉత్పత్తులకు ప్రసిద్ధి
- నాలుగు దశాబ్దాలుగా ఎగుమతులు
- రాజకీయంగా చైతన్యవంతం

నియోజకవర్గం : కైకలూరు

మొత్తం ఓటర్లు : 2,05,604
పురుషులు : 1,01,196
మహిళలు : 1,04,404
ఇతరులు : 4
పోలింగ్ బూత్‌లు : 235

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2019	దూలం నాగేశ్వరరావు	వైసీపీ	జయమంగళ వెంకటరమణ	టీడీపీ	9,357
2014	కామినేని శ్రీనివాస్	బీజేపీ	ఉప్పాల రాంప్రసాద్	వైసీపీ	21,571
2009	జయమంగళ వెంకటరమణ	టీడీపీ	కామినేని శ్రీనివాస్	ప్రజారాజ్యం	974
2004	ఎర్నేని రాజరామచందర్	కాంగ్రెస్‌ఐ	కమ్మిలి విఠలరావు	టీడీపీ	2,056
1999	ఎర్నేని రాజరామచందర్	ఇండిపెండెట్	గట్టమనేని విజయనిర్మల	టీడీపీ	1,109
1994	నంబూరి వెంకటరామరాజు	కాంగ్రెస్‌ఐ	ఎర్నేని రాజరామచందర్	టీడీపీ	5,530
1993	ఎర్నేని రాజరామచందర్(ఉప)	టీడీపీ	నంబూరి వెంకటరామరాజు	కాంగ్రెస్	6,562
1989	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	ఎర్నేని రాజరామచందర్	టీడీపీ	10,535
1985	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	పి.ఆదినారాయణమూర్తి	టీడీపీ	5,283
1983	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	కేవీ రావు	టీడీపీ	803
1978	కనుమూరి బాపిరాజు	ఇండిపెండెంట్	ఎన్.నాగేశ్వరరావు	కాంగ్రెస్‌ఐ	46
1972	కె.మంగతాయారమ్మ	కాంగ్రెస్	జరిమయ్య	ఇండిపెండెంట్	37,312
1967	చెన్నంశెట్టి పాండురంగారావు	ఇండిపెండెంట్	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	1,694
1962	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	5,351
1955	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	5,616
1952	ఏపీ సుబ్రహ్మణ్యం	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	110

ఆక్వా ఎగుమతులకు ప్రసిద్ధి

నాలుగు దశాబ్దాలుగా ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు ప్రసిద్ధి గాంచిన ప్రదేశంగా కైకలూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కైకలూరుకు ఆనుకొని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు సరస్సు ఉండడం ఇక్కడ కొల్లేరు చేపలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. కొల్లేరు చేప పేరు వినగానే మాంస ప్రియులకు నోరూరుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొట్టమొదటిగా చేపల పరిశ్రమకు పునాది వేసింది కైకలూరే. పరిశ్రమ రోజురోజుకి అభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోని తలసరి ఆదాయంలోని మొదటి స్థానంలో కలిదిండి, రెండో స్థానంలో కైకలూరు నిలిచింది.

ఆధ్యాత్మిక శోభ

కైకలూరు గ్రామ నడిబొడ్డున శ్యామలాంబ అమ్మవారు ఆలయం ఉంది. ఇందులో ఒకేచోట మూడు శివాలయాలు ఉండడం ప్రత్యేకత. దీని సమీపానే మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రసద్ధి చెందింది. ఇక్కడ స్వామివారికి మీసాలు ఉండడం విశేషం. కొల్లేరు సరస్సు నడిబొడ్డున కొల్లేటికోట పెద్దింటి అమ్మవారు నిత్యం భక్తుల నీరాజనాలు అందుకుంటూ ఉంటారు. కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి, ముదినేపల్లి మండలంలో సింగరాయపాలెంలోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందినవి.

ఆహ్లాదం.. కొల్లేరు పర్యాటకం

కైకలూరు సమీపాన ఆటపాక పక్షుల కేంద్రం ఉంది. ఇక్కడ వివిధ దేశాల నుంచి వలస పక్షులు ప్రతీ సంవత్సరం కొల్లేరులో సేద తీరుతూంటాయి.ఈ ప్రాంతం పర్యాటకంగా ఎంతో ప్రసద్ధి గాంచింది. ప్రతీ సంవత్సరం లక్షలాదిమంది పర్యాటకులు కొల్లేరు సరస్సును సందర్శించి పక్షుల విన్యాసాలను తిలకిస్తూంటారు. ఈ వాతావరణం ఎంతో ఆకట్టుకుంటుంది.



ప్రచారానికి వడదెబ్బ

- మండుతున్న ఎండలు
- అస్వస్థతకు గురవుతున్న నాయకులు, కార్యకర్తలు
- ఉదయం, సాయంత్రమే ప్రచారం

గణపవరం, మే 2: ఒకపక్క ఎన్నికల వేడి.. మరోపక్క వేసవి ఎండలు మండిపోతున్నాయి. పది దాటితే వాతావరణం నిప్పుల కొలిమిలా తయారవుతోంది. ఎన్నికల ప్రచారానికి వెళ్లాలంటే నాయకులు, కార్యకర్తలు ముందుకు రావడం లేదు. దీంతో గ్రామాల్లో గతంలో ఉన్నంత ఊపు, ఉత్సాహం ఈ ఎన్నికల్లో కనిపించడం లేదు. ఎండలను లెక్క చేయకుండా ఇటీవల ఎన్నికల ప్రచారం నిర్వహించిన కొందరు నాయకులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. దీంతో ఉదయం, సాయంత్ర సమయాల్లో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగులు కూడా అదే సమయంలో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రచార కార్యక్రమాలు నిలుపుదల చేస్తున్నారు. ఆ సమయంలో హాలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎండల తీవ్రత గుర్తించి ప్రధాన పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. వడదెబ్బ తగిలితే తమకు ఎవరు అండగా ఉంటారని అక్కడక్కడా కొందరూ కార్యకర్తలు నిలదీస్తుండడంతో పార్టీలు కూడా వారి అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకుంటున్నాయి.



కొబ్బరి బొండాలు తాగుతున్న జనసేన అభ్యర్థి ధర్మరాజు, కార్యకర్తలు

అప్పటి జోష్ ఏది ?

గత ఎన్నికల్లో పోలిస్తే ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలో ఆ ఉత్సాహం, సందడి కనిపించడం లేదు. పార్టీ అభ్యర్థులు, ముఖ్య నేతలు వచ్చినప్పుడు మాత్రమే నాయకులు, కార్యకర్తలు కనిపిస్తున్నారు. నాయకుల ఎదుట కనిపించే ఎన్నికల ప్రచార సందడి వారు వెళ్లిపోయాక కనబడకకుండా పోతుంది. ఈ తీరు ప్రధాన పార్టీల్లో కనిపిస్తోంది. ఇంతకు ముందు ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే గ్రామాల్లో పట్టణాల్లో రాజకీయ సందడి కనిపించేది. ఎక్కడ నలుగురు కలిసినా రాజకీయ పార్టీలు, అభ్యర్థుల గురించి చర్చ జరిగేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. తమను పలకరించకపోయినా, తక్కువ చేస్తున్నట్లు అనిపించినా అలిగి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇటువంటి వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం నాయకులకు సవాలుగా మారింది.

ఆసక్తి చూపని కార్యకర్తలు

ముఖ్యనేతలు బతిమాలితేనే నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి వస్తున్నారు. గత ఎన్నికల్లో అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి ఓట్లు వేయ్యాలని ఓట్లు అభ్యర్థించేవారు. ఇప్పుడు ఉదయం సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రచారంతో ఎక్కువ మందిని కలవలేకపోతున్నారు. ఉదయం 6 గంటల నుంచి పట్టణాలు, గ్రామాల్లోకి ప్రచార రథాలు వస్తున్నా జనం అంతగా ఆసక్తి కనపరచడం లేదు. ఇంతకు ముందు తమ గ్రామాలకు ఎన్నికల ప్రచార వాహనలు వస్తే ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనించేవారు. మైకుల్లో రికార్డు చేసిన ప్రసంగాలు వినేవారు. ఏ పార్టీ ఏం చెబుతుందనేది గుర్తించేవారు. పార్టీలు చెప్పే అంశాలు, హామీల పైన చర్చ చేసేవారు. ఈ ఎన్నికల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఓటర్లను ఆకట్టుకునేందుకు పాటలు పాడుతూ ప్రదర్శనలు ఇస్తున్న ప్రజలు అంత ఆసక్తి చూపడం లేదు.



కూల్ అవుదాం.. : ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలకొల్లు టీడీపీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు గురువారం గ్రామాల్లో సైకిల్‌పై ప్రచారం నిర్వహించారు. పెదమామిడిపల్లిలో కల్లుగీత కార్మికుడు కల్లు అందించగా కాస్త సేవించి ఎండ నుంచి కూల్ అయ్యారు..

ఏలూరు చేరిన నాగాలాండ్ పోలీసులు

ఏలూరు క్రైం, మే 2 : ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కేంద్ర ఎన్నికల సంఘం ఏలూరు జిల్లాకు భద్రతా దళాలను పంపించింది. ఇప్పటికే నాలుగు పోలీస్ సబ్ డివిజన్లలో నాలుగు ప్రత్యేక కంపెనీలు నెలరోజుల క్రితమే వచ్చాయి. ఇప్పుడు నాగాలాండ్‌కు చెందిన ఇండియన్ రిజర్వు పోలీస్ కంపెనీ (105 మంది) చేరుకున్నారు. ఏలూరు శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి వచ్చిన నాగాలాండ్ ఆర్మ్‌డ్ బలగాలు ఏలూరులోని ఒక కల్యాణ మండపంలో బస చేశాయి. అక్కడకు ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణబాబులు గురువారం వెళ్లి ఆ కంపెనీ బలగాల కమాండర్, డిప్యూటీ కమాండర్‌లతో చర్చించారు. శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించడానికి జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు నాగాల్యాండ్ ఇండియన్ రిజర్వు పోలీసు బలగాలు ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో గురువారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, నాగాలాండ్‌కు చెందిన పోలీసు బలగాలు పాల్గొన్నాయి. డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవడానికి పోలీసుశాఖ భరోసా కల్పిస్తుందన్నారు. శాంతియుత వాతావరణం కల్పించడానికి ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఎవరైనా, ఎక్కడా ఎన్నికల నియమనిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని గాంధీమైదానం, రామకోటి సెంటర్, దక్షిణపువీధి బస్టాండ్, వంగాయిగూడెం సెంటర్, కుండీ సెంటర్ ప్రాంతాల్లో కవాతు చేశారు.



ఏలూరు నగరంలో కవాతు నిర్వహిస్తున్న నాగాలాండ్ రిజర్వు పోలీసులు


విస్తృతంగా ఎన్నికల తనిఖీలు

ఏలూరు క్రైం, మే 2 :ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి గురువారం రాత్రి 7 గంటల వరకూ గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 23.9 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 7,360 రూపాయలు అని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో చేసుకున్న రూ.70 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఎస్ఈబీ దాడులు

ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. మంగళవారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్ అధికారులు, చెక్ పోస్టుల వద్ద సిబ్బంది దాడులు నిర్వహించారు. సారా తయారీ, విక్రయదారులపై 4 కేసులు నమోదులు చేసి వారి నుంచి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2,800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేశారు. డ్యూటీ పెయిడ్ లిక్కర్ కల్గి ఉన్న వారిపై 10 కేసులు నమోదు చేసి 70.3 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.మొత్తం 16 కేసులలో 12 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉంది. 18 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.

అక్రమ మద్యం నియంత్రణకు కంట్రోల్ రూమ్



ఎన్నికల సమయంలో అక్రమ మద్యం నియంత్రణకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమరేశ్వరన్, ఎక్సైజ్ డిపో మేనేజర్ దేవదత్తు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ మద్యం, తదితరాలపై ఫిర్యాదులను 08812-355350 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. జిల్లాలో ఇంతవరకు అక్రమంగా మద్యం తరలిస్తున్న 9 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి వారి నుంచి 207 మద్యం బాటిళ్లను, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన నలుగురు ఉద్యోగులను తొలగించామన్నారు. అధిక ధరలను మద్యాన్ని విక్రయించే దుకాణాల ఉద్యోగులపై కేసులు నమోదు చేశామన్నారు. మద్యం డిపోలు, తయారీ డిస్టిలరీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

1.72 లక్షలు సీజ్



కామవరపుకోట, మే 2 : కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టు వద్ద గురువారం వాహన తనిఖీలలో జంగారెడ్డిగూడేనికి చెందిన కారులో ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకు వెళుతున్న వ్యక్తి నుంచి లక్షా 72 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారి ఎండీ మొహిద్దీన్ తెలి పారు.ఏలూరు ఎన్నికల ట్రెజరీకు పంపామని చెప్పారు. వీఆర్వో కొయ్యగూర బాబూరావు, పోలీసులు కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యారావు, షేక్ నాగూర్, నాగార్జున ఉన్నారు.

అష్టభుజ లక్ష్మీనారాయణుడికి శాంతి కల్యాణం


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పాలకొల్లు అర్బన్, మే 2 : స్థానిక అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శ్రీ వారి జన్మ నక్షత్రం సందర్భంగా గురువారం శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి, ఆండాళ్ళమ్మ వారికి వేద మంత్రాలతో శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. అదే విధంగా శంభన్న అగ్రహారంలోని శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలోనూ శ్రవణా నక్షత్రం సందర్భంగా శాంతి కల్యాణం నిర్వహించారు.

శ్రీవారి కల్యాణోత్సవాలు ప్రారంభం

భీమవరం టౌన్, మే 2: హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మందిరంలో 13వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలను సంప్రదాయబద్ధంగా వేద మంత్రాలతో ప్రారంభించారు ఉదయం 9-15 గంటలకు భీమ లింగేశ్వరరావు, నాగ సుప్రియ దంపతులచే స్వామి, అమ్మ వార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేశారు. అనంతరం అంకురార్పణతో వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కార్యదర్శి కుక్కల బాల తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఈవీఎంల కమీషనింగ్



ఆచంట, మే 2: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అసెంబ్లీకి సంబంధించి ఈవీఎంల కమీషనింగ్ గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టారు. ఈ సందర్భంగా అసెంబ్లీకి సంబంధించి 224 ఈవీఎంలు, 243 వీవీ ప్యాడ్‌లకు సంబంధించి బ్యాలెట్ పేపర్ అమరిక, సింగల్ లోడింగ్ వంటివి ఈవీఎంలకు అమర్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల రిటర్నింగ్‌అధికారి వి. స్వామి నాయుడు , ఏఆర్‌వో ఐపీశెట్టి పర్యవేక్షించారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పరిశీలన

భీమవరం టౌన్,మే 2: ఎన్నికల విధులు నిర్వహించే మైక్రో పరిశీలకులు నియోజకవర్గాలకు విధులు కేటాయించే ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు ఎల్. నిర్మల్ రాజ్ పరిశీలించారు. గురువారం జిల్లా కలెక్టరు ఛాంబరులో ఎన్నికల విధులు నిర్వహించే మైక్రో పరిశీలకులు నియోజక వర్గాల విధులు కేటాయించే ర్యాండమైజేషన్ ప్రక్రియను తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు ఎల్.నిర్మల్ రాజ్ పరిశీలించి, పలుసూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు నిర్భయంగా ఒత్తిడులకి గురి కాకుండా విజయవంతంగా విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధులకు ముందుగా పోలింగు స్టేషన్లు, పోలింగు ప్రక్రియ, తది తర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతా వ రణంలో జరగాలన్నదే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల ధ్యేయమని సాధారణ పరిశీలకులు ఎల్.నిర్మల్ రాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు సి.వి. ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు అర్బన్, మే 2 : పట్టణంలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పాలకొల్లు ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలోగల శ్రీరామ్ పేట, బీఆర్‌ఎంవీఎం హైస్కూల్, వీవర్స్ కాలనీ, బెత్లహం పేట, బస్టాండ్ ఏరియా, బ్యాంక్ కాలనీ, సబ్ రిజిస్ట్రారు కార్యాలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ సురేష్ కుమార్ తెలిపారు.

పెంటపాడు: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని కె.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ళ, పడమరవిప్పర్రు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

పాలకొల్లు కళాకారులకు దాసరి ఫిల్మ్ అవార్డులు


అవార్డులు అందుకున్న పాలకొల్లు కళాకారులు

పాలకొల్లు అర్బన్, మే 2 : దర్శకరత్న దాసరి నారాయణ రావు జయంతి సందర్భంగా ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారయణ హైదరాబాద్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన ముగ్గురు కళాకారులు దాసరి ఫిల్మ్ ఆవార్డులు అందుకున్నారు. కళారంగం, సినీ రంగంలో, సేవా రంగంలో ప్రతిభ కనపరిచిన పలువురికి దాసరి ప్రతిభా అవార్డులను అందించి గౌరవించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన నటీ నట సమాఖ్య గౌరవాధ్యక్షుడు వంగా నరసింహారావు, అధ్యక్షుడు కత్తుల రామ్మోహన్, పాలకొల్లు కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణలకు అవార్డులు సినీ నటుడు మురళీ మోహన్ అందజేశారు. దాసరి ప్రతిభా పురస్కారాలు అందకున్న ముగ్గురిని పలువురు అభినందించారు.

నగదు చోరీ

ఆకివీడు, మే 2: గుర్తు తెలియని వ్యక్తులు తన నివాసంలో రూ.లక్ష నగదు దొంగిలించారని బాధితుడు ఫిర్యాదు మేర హెడ్ కానిస్టేబుల్ జి.దివాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక మట్లావీధిలో నివాసం ఉంటున్న కొవ్వాడ రాంబాబు ఇంటిలో బుధవారం రూ.లక్ష నగదు దొంగిలించబడింది. ఎవరు దొంగిలించారో తెలియదని, తన ఇంట్లో పనిచేస్తున్న పని మనిషిపై అనుమానం ఉన్నట్లు తెలిపాడు.

మూడు చక్రాల కుర్చీ అందజేత

తణుకు, మే 2: దువ్వ గ్రామానికి చెందిన సంకు సాయి కృష్ణ రోడ్డు ప్రమాదంలో గాయపడి లేవలేని స్థితిలో ఉండటంతో మానవత సేవా సంస్థ మూడు చక్రాల కుర్చీని అందజేసింది. గురువారం తణుకుకు చెందిన పెండ్యాల వెంకటేశ్వరరావు రూ. 8 వేల విలువైన మూడు చక్రాల కుర్చీని, మందులు కొనుగోలుకు రూ. 5 వేలు మానవత ద్వారా సాయికృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో గమిని రాంబాబు, పెండ్యాల వెంకటేశ్వరరావు, ఆలపాటి సోమేశ్వరరావు, వంగూరి హనుమంతరావు, అనుకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై యువతకు శిక్షణ


కోర్సు ప్రారంభోత్సవంలో విద్యార్థులు, అధ్యాపకులు

తాడేపల్లిగూడెం రూరల్, మే 2: ఉద్యాన రంగంలో నర్సరీలకు మంచి డిమాండ్ ఉందని ఆసక్తి కలిగిన యువత నర్సరీలను నెలకొల్పేందుకు ముందుకు రావాలని ఉద్యాన వర్సిటీ ఉప కులపతి టి. జానకిరామ్ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో నర్సరీల నిర్వహణలో 16 వారాల సర్టిఫికెట్ కోర్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఔత్సాహికులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్ పద్మావతమ్మ, కోర్సు డైరెక్టర్లు సుశీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగ పంపిణీ

భీమవరం టౌన్, మే 2 : భీమవరం ఆర్టీసీ సిబ్బందికి వేసవి దృష్ట్యా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ కార్యదర్శి చినమిల్లి శ్రీనివాసరావు ఆయన కుమారుడు జ్ఞాపకార్థం మజ్జిగను పంపిణీ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి.రావు చేతుల మీదుగా అందరికి మజ్జిగ పంపిణీ చేశారు.

దోపిడీ ప్రభుత్వాన్ని తరిమేద్దాం: పృథ్వీ


భీమవరంలో సినీనటుడు పృథ్వీరాజ్‌తో కలిసి ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి అంజిబాబు

భీమవరం రూరల్, మే 2 : దొంగల ప్రభుత్వం దోపిడి ప్రభుత్వం జగన్ ప్రభుత్వాన్ని ప్రజలంతా తరిమికొట్టడం ఖాయమని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. భీమవరం పద్మాలయ థియేటర్ నుంచి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నటరాజ్ థియేటర్ సెంటర్ నుంచి శ్రీవెంకటేశ్వరస్వామి వీధి, ఉండి రోడ్డు, బాంబే స్వీట్స్ మీదుగా అంబేడ్కర్ సెంటర్, ప్రకాశంచౌక్, బంగారం షాపులు, తాలూకా ఆఫీస్ సెంటర్, మావుళ్ళమ్మ గుడి రోడ్డు, ఆదివారం బజార్ మీదుగా ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ మీదుగా శిబిరం వరకు ప్రచారం నిర్వహించారు. జగన్‌ని నమ్మితే అన్నింటా మునిగిపోవడమేనని, ఈ ఐదేళ్ళలో ప్రజలంతా ఎంతో నష్టపోయారని అన్నారు. వైసీపీ పాలనలో భీమవరం నియోజకవర్గంలో అవినీతి అక్రమాలతో పరిపాలన గాడి తప్పిందని, అటు రాష్ట్రానికి, ఇటు భీమవరానికి పూర్వవైభవం రావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని అన్నారు. సంక్షేమ పథకాల పేరుతో వైసీపీ ప్రభుత్వం పేదలకు రూపాయి ఇచ్చి పది రూపాయలు లాగారని, అన్ని వర్గాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేశారని, మహిళలంతా ఒక్కసారి మీ గత కరెంట్ బిల్లులు ఇప్పుడు కరెంటు బిల్లులు పోల్చి చూసుకోవాలని అన్నారు. 9 సార్లు మీకు చెప్పకుండా కరెంటు చార్జీలు పెంచిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. జనసేన కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ నిర్ణయించడానికి కొన్ని రోజులే ఉందని అన్నారు. 40వేల మెజార్టీతో నెగ్గుతానని ధీమా వ్యక్తం చేశారు. భీమవరంను ఆక్వా, ఎడ్యుకేషన్, మెడికల్ హబ్‌గా చేస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే తనను ఒక రోజు అంజిబాబు లోకల్ కాదని మరొక రోజు ముసలాయన అని అంటున్నాడు. తను విగ్గు తీస్తే తెలుస్తుంది ఎలా ఉంటాడో అన్నారు.

జనసేనలో చేరిక

భీమవరం టౌన్, మే 2: మంచిరోజులు రాబోతున్నాయని, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే కూటమి మేనిఫెస్టో లక్ష్యమని జనసేన ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక ఎన్నికల శిబిరంలో మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు ఆధ్వర్యంలో 27,28వ వార్డుకు చెందిన 95 మంది మహిళలు పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, బండి రమేష్ కుమార్, మోకా శ్రీను, కత్తుల నిలేంద్ర పాల్గొన్నారు.



పెనుగొండలో ప్రచారం నిర్వహిస్తున్న పితాని తనయుడు భాను.. వల్లూరులో ప్రచారం చేస్తున్న వెంకట్

పితాని కుమారుల ప్రచారం

పెనుగొండ, మే 2: రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు , జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు కష్టపడుతున్నారని ప్రతీ ఒక్కరూ ఓట్లు వేసి పార్టీని గెలిపించి ఈ రాష్ట్రాన్ని కాపాడుకుందామని పితాని తనయుడు భాను అన్నారు. గురువారం పెనుగొండలోని ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికి పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి మాట్లాడుతూ అన్నివిధాలా నష్టపోయిన రాష్ట్రాన్ని ఈ ఎన్నికల్లో మన సత్తా చూపించి కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కటికిరెడ్డి నానాజీ, మండా ప్రసాద్, వేండ్ర రాము, చలుమూరి శేఖర్, యర్ర సత్యనారాయణ, నవుడు కోటి, పులిగోరు రవి కుమార్ పాల్గొన్నారు.

ఆచంట: త్వరలోనే రాష్ట్ర ప్రజలుకు మంచి రోజులురానున్నాయని పితాని సత్యనారాయన తనయుడు వెంకట్ అన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి పితానిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం వల్లూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్యే నిమ్మల వినూత్న ప్రచారం

పాలకొల్లు రూరల్, మే 2 : మీ సేవకునిగా పనిచేస్తున్న నన్ను ఆశీర్వదించండి అంటూ గీత కార్మికునిగా మోకు కట్టుకుని, కల్లు బిందె సైకిల్‌కు తగిలించుకుని గురువారం సైకిల్‌పై గ్రామాల్లో తిరుగుతూ వినూత్నంగా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ప్రచారం చేశారు. గురువారం 69వ రోజున మండలంలోని వరధనం, పెదమామిడిపల్లి, కొత్తపేట, దిగమర్రు గ్రామాల్లో రామానాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామానాయుడు వెంట టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు పోతుల సూరిబాబు, పెచ్చెట్టి నాగరాజు, ఇంటి ప్రసాద్, బొక్కా సూరిబాబు, సిద్ధిరెడ్డి పండు, నిప్పులేటి బాబి, వర్ధనపు కాంతారావు పాల్గొన్నారు. కొత్తపేట గ్రామ పంచాయతీకి చెందిన (సంగర్లవీధి) పలువురు బీసీ నాయకులు టీడీపీలో ఎమ్మెల్యే సమక్షంలో గురువారం చేరారు.


అడవిపాలెంలో ప్రచారం చేస్తున్న సూర్యకుమారి

యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గ ప్రజలందరిని తన కుటుంబంగా భావించే ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును గెలిపించాలని నిమ్మల సూర్యకుమారి అన్నారు. అడవిపాలెం గ్రామంలో గురువారం టీడీపీ జనసేన బీజేపీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి మేనిఫెస్టోలో అనేక పథకాలను రూపొందించారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీల నేతృత్వంలో ఏర్పడిన కూటమి అధికారంలోకి రాబోతుందని అన్నివర్గాల ప్రజలకు లబ్ధిచేకూరే పథకాలను అందిస్తుందని సూర్య కుమారి తెలిపారు.

విద్యుత్ వైర్ల నుంచి మంటలు


ప్రమాదానికి కారణమైన విద్యుత్ వైర్లు

పెనుమంట్ర, మే 2: నత్తా రామేశ్వరం సెంటర్‌లోని ఆర్చి ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉండే ఆటో స్టాండ్ ఉన్న ప్రాంతం. ఈ ప్రాంతంలో విద్యుత్ వైర్లు జాయింట్లు వేయడంతో అవి మంటలు చెలరేగి తెగిపడ్డాయి ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న ఆటోలో ప్రయాణికులు ఆటోలో వెళ్లిపో వడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి సామాన్యులు బలయ్యేవారు. మళ్లీ వైర్లు పునరుద్ధరించడానికి వచ్చిన అధికా రులు మళ్లీ జాయింట్లు వేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు పూర్తిగా విద్యుత్ వైర్‌ను మార్చాలని లేకుంటే ప్రమాదాలు జరుగుతాయని అధికారుల తీరిపై మండిపడ్డారు. కొత్త వైర్లు లేవని విద్యుత్ శాఖ అధికారులు సమాధానం చెప్పడంతో స్థానికులు మండిపడుతున్నారు.

15 నుంచి అతిరాత్ర మహాయాగం

భీమవరం టౌన్, మే 2 : ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు శ్రీఉమా రామలింగేశ్వర ట్రస్టు(నెలమూరు) ఆధ్వర్యంలో రాజా శ్యామల, దశమహా విద్య సహిత అతిరాత్ర మహాయగం నిర్వహిస్తున్నామని యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. డీఎన్ఆర్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ (బాబు), ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ డీఎన్నార్ క్రీడా మైదానంలో ఎన్నో యజ్ఞాలు నిర్వహించామని, ఈ అతిరాత్ర మహాయాగం మన ప్రాంతానికే నూతనమైన యజ్ఞమని, అందరూ విచ్చేసి యజ్ఞంలో పాల్గొని ఆ స్వామి, అమ్మవార్ల అనుగ్రహం పొందాలని కోరారు.

మేనిఫెస్టో పట్ల బ్రాహ్మణ సాధికారిక సమితి హర్షం

భీమవరం టౌన్, మే 2 : తెలుగుదేశం పార్టీ జనసేన ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టోలో బ్రాహ్మణులను గుర్తించి బ్రాహ్మణ సాధికారికతకు పెద్దపీట వేస్తున్నదని నరసాపురం పార్లమెంట్ బ్రాహ్మణ సాధికారిక సమితి కన్వీనర్ చెరుకుపల్లి సంతోష్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. గునుపూడిలో జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేసిన సందర్భంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి ఒక అపర ఖర్మల భవనం నిర్మిస్తామని, ప్రతి ఆలయాల ట్రస్టుబోర్డు సభ్యుల్లో ఒక బ్రాహ్మణుడికి బోర్డు మెంబర్‌గా అవకాశం ఇస్తామని చెప్పారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీని పునర్ధరించి వాటి సంరక్షణకు నిధులు కేటాయిస్తామని ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు.

'మేడే చరిత్ర-ప్రముఖుల ప్రసంగ వ్యాసాలు' పుస్తకావిష్కరణ



తణుకు, మే 2: మేడే చరిత్ర- ప్రముఖుల ప్రసంగ వ్యాసాలు పుస్తకం కార్మిక హక్కులు, చట్టాల పరిరక్షణా ఉద్యమా లకు మార్గదర్శకంగా నిలుస్తుందని దారిదీపం పత్రికా సంపాదకుడు డీవీవీఎస్ వర్మ అన్నారు. గురువారం తణుకు స్టాఫ్ అండ్ వర్కర్సు యూనియన్ ఆఫ్ అక్కమాంబ టెక్స్‌టైల్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన పుస్తకావిష్కరణ సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆకుల అమరయ్య, పీకాక్ ప్రచురణ సంస్థ అధినేత ఎం.గాంధీ, అరసం రాష్ట్ర కార్యదర్శి శరత్‌చంద్ర, జ్యోతిశ్రీ, వర్కర్సు యూనియన్ నాయకులు తమ్మలపల్లి శ్రీనివాసు, దేవ పెద్దిరాజు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు

ముగిసిన బైబిల్ శిక్షణ తరగతులు

భీమవరం టౌన్, మే 2 : భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల రోడ్డు బలుసుమూడిలో గత 24 నుంచి నిర్వహించిన విరామకాల బైబిల్ తరగతులు ముగిశాయి. ఈసందర్భంగా పాస్టర్ సి జయంతరావు, డైరెక్టర్ సి.నిర్మల జయంత్ మాట్లాడుతూ దాదాపు 200 మంది టీచర్లు, 800 చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ఆధ్యాత్మిక జీవితానికి నైతికత జీవితాకి ఉపయోగపడే విధంగా ఎన్నో అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

కూలీలకు పనిముట్లు అందించాలి

తాడేపల్లిగూడెం రూరల్, మే 2: ఉపాధి కూలీలకు పనిముట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. నీలాద్రిపురంలో ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ కూలీలకు పని ప్రదేశంలో మంచినీరు కూడా అందడం లేదని వారే తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఉపాధి కూలీలు వారి సమస్యలు తెలిపారు.

చెస్ క్రీడాకారిణి భవిష్యకు అభినందన


దాట్ల భవిష్యను అభినందిస్తున్న కోచ్ మాదాసు కిషోర్


భీమవరం అర్బన్, మే 2: అఖిల భారత చదరంగం సమాఖ్య ప్రపంచ చదరంగ సమాఖ్య సంయుక్తంగా మే 2024 సంవత్సరంలో విడుదల చేసిన చదరంగం ఫైడ్ ర్యాపిడ్ చెస్ రేటింగ్ జాబితాలో భీమవరం పట్టణానికి చెందిన దాట్ల భవిష్య అనసూయ 1411వ ర్యాంకులో నిలిచినట్టు కోచ్ మాదాసు కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అనసూయ చెస్ అకాడమి సెంటర్‌లో దాట్ల భవిష్యను అభినందించారు. భవిష్య విశ్వకవి సీబీఎస్‌సీ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నది. జిల్లా చెస్ అసోసియేషన్ గౌరవ సభ్యులు అల్లు శ్రీనివాస్, చెస్ అసోసియేషన్ అధ్యక్షులు మాదాసు కిషోర్, కోచ్ పెదపాటి రవి ప్రసాదు, తదితరులు భవిష్యను అభినందించారు.

ఉచిత వైద్య పరీక్షలు

భీమవరం అర్బన్, మే 2: ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ భీమవరం యూనియన్ ఆధ్వర్యంలో హైదారాబాద్ స్టార్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. జి శశికాంత్ ఉచిత వైద్య శిబిరం గురువారం అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్న సుమారు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.

తండ్రి గెలుపు కోసం భరత్, ఇందిరా ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న భరత్, ఇందిర



ఆకివీడు, మే 2: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజాస్వామ్యానికి దిక్సూచి అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరి రఘురామ కృష్ణ రాజు తనయుడు భరత్, తనయ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. గురువారం భరత్ పట్టణ పరిధిలోని 19, 20 వార్డులలోను, ఇందిర అప్పారావుపేట, తరటావలో తండ్రి రఘురామ కృష్ణరాజు కోసం ప్రచారం నిర్వహించి మాట్లాడారు. స్వార్థ ప్రయోజనాల కోసం ప్రతీ వ్యవస్థను జగన్ నిర్వీర్యం చేశాడన్నారు. వీరి వెంట టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మోటుపల్లి సత్యనారాయణ, పిల్లా బాబులు, అడపా అబ్బులు, దారపురెడ్డి కన్నబాబు, మోటుపల్లి అరవింద్‌సాయి, నేరెళ్ళ ప్రసన్న, బచ్చు సరళాకుమారి, మద్దా నరేష్, దాసరి బాలకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

భీమవరం, మే 2(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. కాళ్ల మండలం పెదఅమిరం వైసీపీ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తెలుగుదేశంలో చేరారు. అలాగే వేంపాడు ఉపసర్పంచ్ వేగేశ్న సుమన్ వైసీపీని వీడారు. తెలుగుదేశం కండువా కప్పుకున్నారు. తెలుగుదేశం కూటమి అభ్యర్థి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే రామరాజు సమక్షంలో వారంతా తెలుగుదేశంలో చేరారు.

జోరుగా జనసేన అభ్యర్థి బొలిశెట్టి ప్రచారం


తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి, వలవలకు గజమాలతో స్వాగతం

తాడేపల్లిగూడెం రూరల్, మే 2: తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లి, వెల్లమిల్లి స్టేజ్ వద్ద కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ జగన్ నాటకాలన్నీ అయిపోయా యని, అన్నింటా ఫెయిలై కూటమిపై అక్కసు వెళ్లగక్కు తున్నారన్నారు. ప్రజలకు అన్ని రకాలుగా తాము అండగా ఉంటామన్నారు. స్థానిక మంత్రి కొట్టు అవినీతితో ప్రజలంతా విసుగు చెందారని, అలాంటి నాయకులను తరిమి కొట్టాల న్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడారు.

రాష్ట్రానికి పట్టిన చీడ వైసీపీ: వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, మే 2: రాష్ట్రానికి పట్టిన చీడ వైసీపీ అని టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి గురువారం పట్టణంలోని 15వ వార్డు, పడాలలో ప్రచారం నిర్వహించారు. వైసీపీ అరాచక పాలన పోవాలంటే ఉమ్మడి కూటమి అధికారంలోకి రావాలన్నారు. తాడేపల్లిగూడెంలో కే టాక్స్ లు చెల్లించలేక ఇప్పటివరకు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డార న్నా రు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజక వర్గంలో అవినీతిని రూపుమాపి నీతివంతమైన పాలన అందించేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

యాదవులకు అండగా ఉంటాం

తాడేపల్లిగూడెం అర్బన్, మే 2: యాదవులకు అన్ని వేళలా అండగా ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. యాదవ సంఘ నాయకులు నీలపాల దినేష్‌కుమార్ యాదవ్, కాళ్ళ గోపీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే యాదవుల సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

కూటమి మేనిఫెస్టోకు విశేష ఆదరణ



ప్రచారం నిర్వహిస్తున్న తణుకు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ.. కృష్ణ తులసి

తణుకు, మే 2: కూటమి మేనిఫెస్టోను ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని 12వ వార్డులో కూటమి తరపున ప్రచారం చేశారు. సాయంత్రం తణుకు మండలంలోని ముద్దాపురం, కోనాల గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. తణుకు చరిత్రలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి తప్ప తర్వాత కాలంలో అభివృద్ధి శూన్యమన్నారు. మాస్టర్ ప్లాన్ రూపొందించి రోడ్లు, డ్రైనేజీఈ వ్యవస్థను మెరుగుపర్చామని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో అరాచకం తప్ప అభివృద్ధి లేదన్నారు. చంద్రబాబు బీసీల రక్షణ చట్టం తేవడంతో పాటు 50 ఏళ్ళకే పింఛన్ కల్పించడం గొప్ప పరిణామన్నారు. అది కూడా నాలుగు వేలు పెంచడం జరుగుతు ందన్నారు. పింఛన్ల పంపిణీపై వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మ వద్దని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించ డంతో పాటు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు. తనకు సైకిల్ గుర్తుకు, పార్ల మెంటు అభ్యర్థికి కమలం గుర్తుపై ఓటె య్యాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలగర వెంకట కృష్ణ, బట్టవల్లి నాగరాజు, ఆంజనేయులు, పెండింటి దుర్గారావు, రబిలి ఆదిలక్ష్మి, ఉమ్మిడి వెంకటేశ్వరరావు, తమరాపు సత్యనారాయణ, బూరుగుపల్లి రమేష్, చిటికిన సత్యనారా యణ, వల్లభనేని వీరాస్వామితో పాటు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

- టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కుట్టు మిషన్ కుట్టి కార్యకర్తల్లో జోష్ నింపారు. కృష్ణ తులసి ఎండను సైతం లెక్క చేయకుండా ఎంతో ఉత్సాహంగా తన భర్త రాధాకృష్ణ తరుపున ప్రచారం చేసి సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థిస్తున్నారు. అలాగే ఇరగవరంలో కూడా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వైసీపీ పతనం ఖాయం: నాయకర్


సీతారాంపురంలో ప్రచారం చేస్తున్న నాయకర్, బండారు,నరేంద్ర

నరసాపురం, మే 2: మరో 10 రోజుల్లో జరిగే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, బీజేపీ రాష్ట్ర నాయకులు నరేంద్ర కలసి పట్టణంలోని 1, 10 మండలంలోని సీతారాంపురం నార్త్, మొగల్తూరు మండలం కొత్తోటలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీతారాంపురంలో నాయకర్‌కు మహిళలు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. అన్ని వర్గాలకు మేలు చేకూరేవిధంగా అద్భుతమైన మేనిఫెస్టోను ప్రవేశపెట్టిన చంద్రబాబు, పవన్‌ల చిత్రపటాలకు నాయకులు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నరసాపురం ప్రజల్ని దగా చేశారన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

నరసాపురం, మే 2: పోలింగ్ విధుల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని నరసాపురం ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.అచ్యుత్ అంబరీష్ అన్నారు. నరసాపురం వైఎన్ కళాశాలలో గురువారం పోలింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది సామగ్రిని తీసుకునే సమయంలో ఒకటికి రెండు సార్లు తనిఖీలు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది ఎన్నికల సామాగ్రిని తీసుకువెళ్ళే సమయంలో వారికి కేటాయించిన రూట్ బస్‌లలో పోలింగ్ కేంద్రాలకు వెళ్ళాలన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోతో మరింత ఉత్సాహం

నరసాపురం, మే 2: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు రూపొందించిన ఉమ్మడి మేనిఫెస్టో ప్రజల్లో మరింత ఉత్సాహం, ఆత్మస్థైర్యం నింపిందని జిల్లా తెలుగుదేశం మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో ఆచరణీయంగా ఉందని ప్రజలు స్వాగతిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల చిత్ర పటాలకు ఆమె పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ యూనిస్ బేగం, సుంకర రాజకుమారీ, చల్లా పద్మావతి, ఆలవల తాయారు, కంబాల వెంకట లక్ష్మీ, తోట భారతి, తోట అరుణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

తణుకు, మే 2: నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ప్రత్యేక పోలీసు అబ్జర్వర్ శైలేష్‌కుమార్ సిన్హా గురువారం పరిశీలించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. అత్తిలి, ఇరగవరం, తణుకు రూరల్, పట్టణం పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గతంలో నమోదైన పాత గొడవలు, ప్రస్తుత పరిస్థితులపై స్థానిక పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పెనుగొండ: చెక్ పోస్టులు వద్ద తనిఖీలు విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టులు నిర్వహణ పనితీరును గురువారం దొంగరావిపాలెం హైవే చెక్ పోస్టు వద్ద రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అనుమానాస్పద వాహనాల పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.